గుంతలమయంగా బైపాస్‌రోడ్డు

- మాధవనగర్ ఆర్వోబీ నుంచి కంఠేశ్వర్ బైపాస్ వరకు లేని డివైడర్లు
- కనిపించని సూచిక బోర్డులు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బైపాస్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు



రోడ్డుపై ఉన్న గుంతలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని మాధవనగర్ ఆర్వోబీ వద్ద నుంచి అర్సపల్లి వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు ఉంటుంది. ఆర్వోబీ నుంచి కంఠేశ్వర్ బైపాస్ వరకు రోడ్డు మధ్యలో డివైడర్లు లేవు. ఖానాపూర్ చౌరస్తానుంచి అర్సపల్లి రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం లేదు. బైపాస్ రోడ్డు గుంతలమయంగా మారడంతో వావనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయలేదు. సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రాత్రివేళలో వాహనదారులకు ఎక్కడ గుంతలున్నాయో తెలియక ప్రమాదాలు బారినపడుతున్నారు. అధికారులు స్పందించి గుంతల రోడ్లకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

మాధవనగర్ ఆర్వోబీ నుంచి కంఠేశ్వర్ వరకు ఉన్న గుంతలను పూడ్చాడానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఖానాపూర్ చౌరస్తా నుంచి అర్సపల్లి వరకు రహదారి విస్తరణతో పాటు మధ్యలో డివైడర్లు, లైటింగ్స్ ఫుట్‌పాత్ నిర్మాణానికి రూ. 36 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– సాయికుమార్ ఆర్‌ఎండ్‌బీ ఏఈ, నిజామాబాద్‌రూరల్

అధికారులు పట్టించుకోవాలి

మాధవనగర్ ఆర్వోబీ నుంచి కంఠేశ్వర్ వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని. పెద్ద ప్రమాదాలు జరుగకముందే అధికారులు అప్రమత్తం కావాలి.

– నర్సయ్య, గంగాస్థాన్ వాహనదారుడు

క్లుప్తంగా

జీపీవోల నూతన కార్యవర్గం ఎన్నిక



మోపాల్: మోపాల్ మండల గ్రామ పాలన అధికారి (జీపీవో)ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా వేణుగోపాల్ రావు, అధ్యక్షులుగా చింతల రవి, ప్రధాన కార్యదర్శిగా గున్నం సంతోష్, కోశాధికారిగా గంగాభవాని, ఉపాధ్యక్షురాలు పి రజిత, సంయుక్త కార్యదర్శిగా బండి రాజన్న, కార్యవర్గసభ్యులుగా దేవయ్య, స్వరూప, రజిని, జ్యోతి, నవీన్ ఎన్నికయ్యారు. అనంతరం మర్యాదపూర్వకంగా తహసీల్దార్ ఎన్ రేఖ, డీటీ, ఆర్ఐను కలిశారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గానికి వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

నామినేషన్ కేంద్రం తనిఖీ



సిరికొండ: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల నామినేషన్ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన బూత్‌లను ఆయన పరిశీలించారు. మండల అధికారులకు ఆయన వివిధ సూచనలు చేశారు. మండల ప్రత్యేకాధికారి నాగోరావు, ఎంపీడీవో కేఆర్ మనోహర్‌రెడ్డి ఉన్నారు.

విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి



సుభాష్‌నగర్: తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, ఇంటి డాబాలపై తీగలు కట్టి బట్టలు ఆరేయకూడదని ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ డీఈ ఏ రమేష్ సూచించారు. గురువారం నగరంలోని మానిక్‌భవన్ పాఠశాలలో నిర్వహించిన విద్యుత్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించుకుందామని, భద్రత సూచనలు పాటిద్దామని పిలుపునిచ్చారు. వర్షం కురిసినప్పుడు విద్యుత్ స్తంభాలను తాకకూడదని, షాక్ తగిలిన వ్యక్తిని రక్షించాలనే ఆత్రుతతో ఆ వ్యక్తిని ముట్టుకోవద్దని, కర్రను వినియోగించాలని తెలిపారు. విద్యుత్ సమస్య వచ్చినా 1912కు కాల్ చేసి తక్షణ సాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వారణాసిలో మణికంఠ శివాచార్యులకు సత్కారం

బోధన్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారాణాసి సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం నిర్వహించిన వేదాంత ఆచార్య జాతీయ పరీక్షలో బోధన్‌వాసి మహారాష్ట్ర ప్రాంతంలోని లాతూరు జిల్లాలో గల లక్ష్మీదహివడి బార్సీ త్రిమఠాధిపతి గురుసిద్ధ మణికంఠ శివాచార్యులు ప్రతిభ కనబరిచి తొలి ర్యాంక్ సాధించిన విషయం తెలిసిందే. గురువారం వారాణాసిలోని ఆ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఉత్సవాల్లో గురుసిద్ధ మణికంఠ శివాచార్యులకు ఆ రాష్ట్ర గవర్నర్ ఆనందీబెన్ చేతుల మీదుగా మూడు స్వర్ణ పతాకాలు, ప్రశంసా పత్రాలు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం కాశీ జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్యుల వద్దకు వెళ్లి ఆశీస్సులు పొందారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,29,500	వెండి(కిలో)	1,71,000
22 క్యారెట్స్	1,19,325		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	32	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	80
జీరకాయ	50	100	దోసకాయ	30	60
దొండకాయ	50	100	ఆలుగడ్డ	30	60
జిర్నినుకాయ	100	180	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	100
వంకాయ	40	80	బీట్‌రూట్	40	80
పాలకూర	80	160	కరివేపాకు	40	80
మెంతికూర	100	180	చామగడ్డ	30	60
కొత్తిమీర	80	160	చిక్కుడుకాయ	30	60
పుదీనా	50	100	గోరుచిక్కుడు	50	100
క్యాప్సికం	50	100			

–సుభాష్‌నగర్

ఎన్నికలపై బీఆర్ఎస్ సమావేశం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ: మండల కేంద్రంలోని కేజీదాస్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌లు మాట్లాడారు. వివిధ గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ చేరిక

ధర్పల్లి: మండలంలోని ఎస్‌టీ తండాకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం నిజామాబాద్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారికి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పార్టీ కండువాను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నాయకులు మహిపాల్ యాదవ్, రాజ్‌పాల్ రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు స్పందించలే.. ప్రైవేటు సారు స్పందించారు



గుంతల్లో కంకర పోస్తున్న నర్సయ్య, సిబ్బంది

సిరికొండ: మండల కేంద్రం నుంచి భీంగల్ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతలను సిరికొండ సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య పూడ్చి వేయించాడు. రూ.10,000 టిప్పర్ కంకర మిక్చర్ తెప్పించి గురువారం గుంతల్లో పోయించాడు. అతనితో పాటు సిబ్బంది కంకరను గుంతల్లో వేసి చదును చేశారు. ఈ మార్గంలో దొండ్ల వాగు ప్రవాహానికి గత నాలుగేళ్లుగా రోడ్డు ధ్వంసమవుతోంది. రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించకపోవడంతో గుంతలను కంకరతో పూడ్చివేశాడు. ఈ గుంతలతో ప్రమాదం పొంచి ఉందని రెండు రోజుల క్రితం సాక్షిలో కథనం కూడా ప్రచురితమైంది. అయిన ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించలేదు.

యాత్రదానం సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న

ఖలీల్‌వాడి: ఆర్టీసీ యాత్రదానం సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ లోని ఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025, ఏప్రిల్ 14 నుంచి జూన్ 30 వరకు గ్రాండ్ పిక్ ఛాలెంజ్ లో టార్గెట్ రూ. 6294.64 లక్షల టార్గెట్ ఉండగా రూ.6591.05 లక్షలు వచ్చినట్లు చెప్పారు. ప్రయాణికులకు ఎల్లప్పుడూ ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డిప్యూటీ ఆర్ఎం మధుసూదన్, నిజామాబాద్ డిపో–1 ఆనంద్ ఉన్నారు.

సంక్షిప్తం

కార్మిక వర్గానికి సంక్షేమ పథకాలను నేరుగా వర్తింపజేయాలి

నిజామాబాద్ సిటీ: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పజెప్పడాన్ని తక్షణమే విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూనాయకుడు శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను నేరుగా ప్రభుత్వమే కార్మిక వర్గానికి అందజేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అడ్డాల వద్ద, పని స్థలాల్లో భద్రత, రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని తక్షణమే కార్మిక వర్గానికి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రమేష్ అరుణ్ విజయ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

నిజామాబాద్ సిటీ: స్థానిక సంస్థల ఎన్నికల వాయిదాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. గురువారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సుధాకర్ మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ఏడాది క్రితం ముగిసిందన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ బిల్లు ఆమోదించి ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో మలిదశ తెలంగాణ ఉద్యమం మాదిరిగా బీసీలంతా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఓ విద్యార్థి సంఘానికి కొమ్ము కాస్తున్న వర్సిటీ ప్రిన్సిపాల్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఓ విభాగ ప్రిన్సిపాల్ ఒక విద్యార్థి సంఘానికి కొమ్ము కాస్తున్నారని వర్సిటీ ఏబీవీపీ ప్రధాన కార్యదర్శి సమీర్ ఆరోపించారు. గురువారం తెయూ క్యాంపస్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పీజీ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ క్రమంలో చాలా మంది విద్యార్థులు హోల్డింగ్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీ) తీసుకుని రాగా అవి చెల్లవని ప్రిన్సిపాల్ తిప్పి పంపించారని తెలిపారు. కచ్చితంగా ఒరిజినల్ టీసీ కావాలని కొందరు విద్యార్థులను తిరిగి పంపిన ప్రిన్సిపాల్ తానే ఈ నిబంధన ఉల్లంఘించి ఒక విద్యార్థి సంఘానికి చెందిన ముగ్గురు విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో తెయూ ఏబీవీపీ నాయకులు అశోక్, మనోజ్ అనిల్, శివ, సాయి తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు

నిజామాబాద్‌అర్బన్: బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు స్టే ఇవ్వడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిదని మాజీ జెడ్పీ చైర్మన్ విఠల్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు.


స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీఈడీ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి కే.శివ కోరారు. ఈ మేరకు గురువారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తెయూ వీసీ ప్రొఫెసర్ టీ.యాదగిరిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులున్నారు.

శాస్త్రీయ విద్య సాధనకు పోరాడుదాం

మోపాల్: శాస్త్రీయ విద్య సాధన కోసం ఉద్యమించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం మోపాల్ మండలంలోని సిర్పూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యార్థులకు ఉపయోగపడే విధానాలను విద్యలో ప్రవేశపెట్టడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు విద్యాశాఖకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్‌చేశారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సాయికిరణ్, బండమీద అజయ్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



సుభాష్‌నగర్: నగరంలోని 33/11 కేవీ వినాయక్‌నగర్ ఉప కేంద్రం నుంచి 11 కేవీ గాయత్రినగర్ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏడీఈ ఆర్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదకరంగా, అపాయం కలిగించే స్తంభాల తొలగింపు, లైన్ కన్వర్షన్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గాయత్రినగర్, వినాయక్ నగర్‌లోని అన్నపూర్ణ అపార్ట్‌మెంట్, స్నిగ్ధ, సాయరెడ్డి అపార్ట్‌మెంట్, శ్రీసాయి, వెంకీ స్కై, వెంకీస్ గోల్డ్ అపార్ట్‌మెంట్, సంకట విమోచన హనుమాన్ టెంపుల్, భూలక్ష్మీ మాతా ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు.

ఒత్తిడికి లోనుకావొద్దు



నిజామాబాద్ నాగారం: విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకావొద్దని ప్రముఖ సైకాలజిస్ట్ టి.కేశవకుమార్ అన్నారు. గురువారం లయన్ సహరా ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ వారు మానసిక ఒత్తిడి–శ్రేయస్సుపై వాగ్దేవి డిగ్రీ కాలేజీలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యోగా చేయడంతో మానసిక ఒత్తిడిని జయించవచ్చని సూచించారు. కార్యక్రమంలో బి.నరసింహరావు, ఉదయసూర్యభగవాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం అందజేత



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ దీప గురువారం సౌండ్ సిస్టం ను అందజేశారు. దీని విలువ రూ.45 వేలు ఉంటుందని జీహెచ్ఎం జి.నరేష్ తెలిపారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఏదైనా సాయం చేయాలనే ఆలోచనతో సౌండ్ సిస్టం అందించినట్లు పూర్వ విద్యార్థి దీప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత సేవాలాల్ మహరాజ్



ధర్పల్లిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ధర్పల్లి: సేవాలాల్ మహరాజ్ గొప్ప స్ఫూర్తి ప్రదాత అని బీజేపీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి పూలమాలవేసి , ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మహిపాల్ యాదవ్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ ఆశీస్సులతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ ఘన విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. గిరిజనులకు బీజేపీ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, సరిచంద్, తిరుపతి నాయక్, మోహన్ నాయక్, దేవి సింగ్, శంకర్, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అధిక సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న నర్సింలుగౌడ్

సిరికొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకోవడం తగదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కొయ్యాడ నర్సింలుగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో బీసీల జనాభా 56 శాతంకు పైగా ఉన్న కేవలం 42 శాతం మాత్రమే ప్రకటించడం జరిగిందని, ఇంకా దాన్ని కూడా అమలు చేయకపోతే బీసీలు అన్ని రంగాల్లో వెనుకబాటుతనానికి గురవుతారని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు అధిక మొత్తంలో టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమణాగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి, రాష్ట్ర కార్యదర్శి నారాగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంగౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు బండారి నరేష్, మండల కార్యదర్శి మంత్రి బాలాజీ, పోశెట్టి, లింబాద్రి, చిన్న బాలాజీ, చైతన్య, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే దురదృష్టకరం

నిజామాబాద్‌సిటీ : బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం దురదృష్టకరమని, రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు అడ్డుకోవడం సరికాదని జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రా జనరేందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. బీసీలు ఎవరూ అధైర్యపడొద్దన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

- నేడు జిల్లాకేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి రాక నేపథ్యంలో స్పెషల్ టీంతో పనులు



రోడ్డుపక్కన పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు



బోర్గాం(పి) ఫంక్షన్‌హాల్ వద్ద శుభ్రంచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు జిల్లా కేంద్రంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో జరిగే ఓ ప్రైవేట్‌కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో కొత్త కలెక్టరేట్ సముదాయం నుంచి బోర్గాం (పి) వరకు రూట్‌మ్యాప్‌ను మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ పర్యవేక్షించారు. రోడ్డు వెంబడి చెత్త లేకుండా శుభ్రంచేయించారు. బోర్గాం (పి) లోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ పరిసరాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకుల సునీల్ పర్యవేక్షించారు. పారిశుద్ధ్య కార్మికులు, జవాన్లతో పనులు చేయించారు. శానిటేషన్ పనులను కమిషనర్ దిలీప్ కుమార్ పర్యవేక్షించారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో సాయారెడ్డి

నిజామాబాద్‌నాగారం: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని నిజామాబాదు ఎంఈవోఎం. సాయారెడ్డి సూచించారు. నగరంలోని కసాబ్‌గల్లీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో సాయరెడ్డి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ నేర్చుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాయి లింబాద్రి, పి.రాఘవేందర్, కోశాధికారి అంకం రాజేందర్, పూర్వాధ్యక్షులు చింతల గంగాదాస్, ప్రోగ్రాం చైర్మన్ యెండల ప్రశాంత్,పాఠశాల టీచర్లు సుజాత, అస్మా జరీన్ తదితరులున్నారు.

సీజేఐపై దాడి అప్రజాస్వామికం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నిజామాబాద్ సిటీ: సీజేఐ బీఆర్ గవాయిపై దాడికి యత్నించడం అప్రజాస్వామికమని, ఈ దాడిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పులాంగ్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ సీజేఐ బీఆర్ గవాయిపై షూ విసిరిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రమేష్ బాబు, వెంకట రాములు, వెంకటేష్, గంగాధర్, నన్నే సాబ్, సుజాత, మరియు నాయకులు సాయిలు, మోహన్ ,సిర్పలింగం, సత్యనారాయణ, లక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: సీజేఐ బీఆర్ గవాయిపై దాడికి యత్నించిన ఘటనను ఖండిస్తున్నామని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌లాల్ తెలిపారు.ఈమేరకు ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని రెవెన్యూ భవన్‌లో నిజామాబాద్ డివిజన్ సంబంధించి గురువారం పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ పబ్లికేషన్ ఆఫీసర్లకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి రాజేంద్రకుమార్ హాజరై మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను వివరించారు. నార్త్, సౌత్ తహసీల్దార్లు విజయ్ కాంత్, బాలరాజులు పాల్గొన్నారు.

స.హ.చట్టంపై అవగాహన పెంపొందించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ప్రభుత్వ వివిధ శాఖల అధికారులకు సూచించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ ఆఫీస్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో సబ్ కలెక్టర్ మాట్లాడారు. సుపరిపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయడం, పాదర్శకత సమాచార హక్కు చట్టం లక్ష్యంగా ఉందన్నారు. ఆయా శాఖల సమాచార హక్కు చట్టం అప్పీలు అధికారులు పాల్గొన్నారు.